క్లుప్తంగా

ఆర్థిక సాయం



కాటారం: మండలంలోని కొత్తపల్లికి చెందిన చిర్ర రాజేందర్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకోవడానికి ఆర్థికంగా లేకపోవడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి ఆదివారం పరామర్శించారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షినిరాకేశ్ ఆదేశాల మేరకు రూ.3వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, చీర్ల బాపురెడ్డి, అజ్మీరా వేణు, దేవా నాయక్, భవాని, రాజ్‌కుమార్, రజాకర్, సమ్మయ్య, మల్లయ్య, రాములు పాల్గొన్నారు.

పరామర్శ



కాటారం: మండలంలోని చిద్నెపల్లి గ్రామానికి చెందిన 7200 తీన్మార్ మల్లన్న టీం సభ్యుడు అనపర్తి రాజేశ్ పక్షవాతానికి గురై చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధితుడిని ఆదివారం మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవిపటేల్ పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేశ్ వైద్య పరీక్షల నిమిత్తం తక్షణ సహాయం కింద మల్లన్న రూ.50 వేలు ప్రకటించినట్లు రవిపటేల్ తెలిపారు. మెరుగైన వైద్యం అందేలా మల్లన్న టీం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఇనుగాల ప్రణయ్, కరుణాకర్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన టిప్పర్



కాటారం: మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ వద్ద బొగ్గు టిప్పర్ బైక్ ఢీ కొట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్రిపల్లి గ్రామానికి చెందిన పిట్టల లచ్చయ్య అనే భవన కార్మికుడు పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై చింతకాని క్రాస్ వద్ద గారెపల్లి వైపుగా మూల మలుపు తీసుకుంటున్నాడు. ఇదే క్రమంలో తాడిచెర్ల నుంచి భూపాలపల్లి వైపుగా వెళ్తున్న బొగ్గు టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న లచ్చయ్య ఎగిరిపడటంతో గాయాలపాలయ్యాడు. బైక్ టిప్పర్ టైర్ల కింద పడటంతో నుజ్జునుజ్జు అయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

గుంతలమయంగా రహదారి

వెంకటాపురం(కె): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఎదిర పంచాయతీ వరకు గల రహదారి గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డుపై ప్రయాణించేందుకు ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30 కిలోమీటర్ల ఇలానే ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేయించేలా అధికారులు చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలపై దృష్టి
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

మరో ఇరవై రోజుల్లో(ఏప్రిల్ 03న) పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 6 వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పని చేస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రణాళిక బద్ధంగా విద్యా బోధన సాగిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు. వెనుకబడిన వారిని గుర్తించి సబ్జెక్టుల వారిగా పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. 10 జీపీఏ సాధించేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

\- మొగుళ్లపల్లి



స్టడీ అవర్స్‌లో చదువుతున్న విద్యార్థులు

మండల వ్యాప్తంగా మోడల్ స్కూల్, కస్తూరిబా విద్యాలయం, ఎంజేపీ కలుపుకోని మొత్తం 11 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం పదోవ తరగతి విద్యార్థులు 262 మంది ఉన్నారు. మెరుగైనా ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అదే రీతిలో విద్యార్థులతో సాధన చేయించాలని అధికారులు ఆదేశిస్తున్నారు. నిత్యం పాఠశాలను పర్యవేక్షించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. లక్ష్య సాధన కోసం ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయడంతో పాటు ప్రతీ రోజు మూడు గంటల పాటు ఉదయం, సాయంత్రం వేళ్లలో ప్రత్యేక తరగతులు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రారంభానికి ముందు, ముగిసిన తరువాత ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రోజు ఒక సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతి నిర్వహణతో పాటు స్టడీ అవర్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు కలిగిన సందేహాలను నివృత్తి చేయడంతో విద్యార్థుల్లో మనోధైర్యాన్ని కలిగిస్తున్నారు. ఉపాధ్యాయులు ఉదయం సాయంత్రం ప్రత్యేక క్లాస్‌లు నిర్వహిస్తుండతో గత నెల 15 నుంచి ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. ఒక్కోరికి రోజుకు రూ.15 చొప్పున ఖర్చు చేసి స్నాక్స్‌ను అందిస్తున్నారు.

విద్యార్థులు సిద్ధం కావాలి



“పరీక్షల సమయంలోనే కాకుండా మొదటి నుంచి ప్రణాళిక పరంగా పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి. మండలంలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

\- ప్రభాకర్, ఎంఈఓ, మొగుళ్లపల్లి

మెరుగైన ఫలితాలు సాధిస్తాం..



గత కొన్ని సంవత్సరాలుగా మంచి ఫలితాలు సాధిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్‌గా నిలవడం కోసం ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు. ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

\- రమేష్, ప్రధానోపాధ్యాయుడు, హైస్కూల్, మొగుళ్లపల్లి

నైట్‌హాల్ట్ బస్ సర్వీస్ కల్పించండి



చిట్యాల: మాట్లాడుతున్న గ్రామస్తులు



పలిమెల: వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

చిట్యాల: మండలంలోని అందుకుతండా గ్రామానికి నైట్‌హాల్ట్ బస్ సర్వీస్ కల్పించండని సర్పంచ్ భాస్కర్‌తో పాటు గ్రామస్తులు అధికారులను కోరారు. ఆదివారం గ్రామంలో వారు మాట్లాడుతూ.. కరోనా ముందు గ్రామానికి ప్రతి రోజు నైట్‌హాల్ట్ బస్ సర్వీస్ వచ్చేదని తెలిపారు. దీంతో విద్యార్థులతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి మంచి సౌకర్యం ఉండేదన్నారు. కాని అప్పటి నుంచి గ్రామానికి రాత్రి వేళ బస్ సర్వీస్ బంద్ చేయడంతో మండలానికి మారుమూల ప్రాంతాలైన జడల్‌పేట, నైన్‌పాక, చైన్‌పాక, అందుకుతండా, వెంచరామి, కుర్మపల్లి గ్రామాలకు చెందిన గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, విద్యార్థులు, నిత్యావసర సరుకుల కోసం వచ్చే వారు బస్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్న కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైన పాలకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి అందుకుతండాకు నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని యెడల మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

పలిమెల: ఏటూరునాగారం నుంచి ముకునూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని హనముకొండ డిపో మేనేజర్‌కు సర్పంచ్ సత్యనారాయణ వినతిపత్రం అందించారు. ×ప్రజల వద్దకు ఆర్టీసీ× కార్యక్రమంలో భాగంగా ఆదివారం కన్నాయిగూడెం మండలానికి వచ్చిన డిపో మేనేజర్‌ను వారు కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం డిపో మేనేజర్ సర్పంచ్‌తో కలిసి ముకునూర్ వరకు ఉన్న రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. త్వరలోనే ఈ రూట్‌లో బస్సు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొడెం సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సదస్సుకు తరలిన ఉద్యమకారులు



కాటారం: సదస్సుకు వెళ్తున్న ఉద్యమకారులు



మల్హర్: నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

కాటారం: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మగౌరవ సదస్సుకు మండలంలోని ఉద్యమకారుల ఫోరం నాయకులు తరలివెళ్లారు. ఫోరం రాష్ట్ర కార్యదర్శి బొమ్మ సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లోని పలువురు ఉద్యమకారులు బయల్దేరి వెళ్లారు. ప్రభుత్వం ఉద్యమకారుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటు ఆదుకునే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. దోమల సమ్మయ్య, చీర్ల తిరుపతిరెడ్డి, లింగయ్య, నాగుల తిరుపతిరెడ్డి, సయ్యద్ అలీం తదితరులు ఉన్నారు.

మల్హర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఆత్మగౌరవ సదస్సుకు మండలానికి చెందిన ఉద్యమకారులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని అనేక ఉద్యమాలు చేసి కేసులు, బైండోవర్లను ఎదుర్కొని ఉద్యమించిన స్వరాష్ట్రంలో తీరని అనాయ్యం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ముడతనపల్లి ప్రభాకర్, పోలోజు సత్యనారయణ, బోయిన రాజయ్య, కొండ్ర సారయ్య, చొప్పరి రాజు, షేక్ చాంద్, గట్టయ్య, గడ్డం సమ్మక్క ఉన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

చిట్యాల: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ఆదివారం జూకల్‌లోని బీఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి అధ్యక్షతన పార్టీ బూత్ స్వశక్తి అభియాన్ సమ్మెళనాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కీర్తిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి లెవెల్‌లో కమిటీలను పూర్తి చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని అన్నారు. స్వశక్తి కేంద్రాల ద్వారా రాష్ట్రపతి ప్రసంగంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వెళ్లేలా కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వైఫల్యాలు అవినీతి కుటుంబ పాలనకు వ్యతిరేకంగా బూతు స్థాయి నుంచి సొసైటీ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పని చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు కన్నం యుగందర్, ఉపాధ్యక్షుడు ప్రసాదరావు, జిల్లా అధికార ప్రతినిధి పాలెపు రాంబాబు, నాయకులు వెన్నంపల్లి పాపయ్య, చాడ రఘునాథ్‌రెడ్డి, ఎరుకల గణపతి, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, గుండ మణికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు



డొబ్బలపాడు వద్ద మరమ్మతు చేసిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

మహాముత్తారం: వర్షాకాలంలో కురిసిన వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు, కల్వర్టులు భారీగా కోతకు గురయ్యాయి. దీంతో ‘రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..’ అనే శీర్షికతో ‘సాక్షి’లో ఆదివారం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు డొబ్బలపాడు వద్ద కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రెండు రోజుల్లో డాంబర్ వేసి పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కారం అయ్యేలా కృషి చేసిన ‘సాక్షి’కి స్థానికులు, మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

జాంబవ సంక్షేమ సంఘ వార్షికోత్సవం

భూపాలపల్లి రూరల్: జాంబవ సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సీతారామాంజనేయ ఆలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు సంఘం అధ్యక్షుడు మచ్చ భద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో కుల సంఘం అభివృద్ధితో పాటు, సంఘంలోని పేదలను ఆదుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా కుల పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు అంబాల చంద్రమౌళి, కొత్తూరి రవీందర్, జాంబవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి పుల్యాల తిరుపతి, నాయకులు రాజం, రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1997–98 పదో తరగతికి చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకుంటూ కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ఏటూరునాగారం: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి మొదలైన పాదయాత్ర ఏటూరునాగారం వచ్చిందన్నారు. ఈ పాదయాత్రలో ముక్కెర ముఖేష్, పుల్లూరు కరుణాకర్, చేతన్, గుగ్గిల సురేష్, నర్సింహరావు, కన్నయ్య, సోషలిస్టు పార్టీ జిల్లా నాయకుడు వావిలాల స్వామి, సాంబశివరావు, వంకర్, రాంబాబు, జయబాబు, ముత్తయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

ఆలయానికి స్టూల్స్ బహూకరణ

పరకాల : పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన గోవిందు కుమార్ దంపతులు ఆదివారం 5 కూర్చునే స్టూళ్లను బహూకరించారు. ఈ మేరకు వారు స్టూళ్లను ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఆలయానికి వచ్చే వృద్ధులకు స్టూళ్లు ఉపయోగపడతాయని చెప్పారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాన శిబిరం వద్ద ఎమ్మెల్యే పొదెం వీరయ్య



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వాజేడు: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం కలుగుతుందని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సాయి ప్రకాశ్‌ను సహకరించిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

గ్రామంలోని యువతకు ఎమ్మెల్యే వీరయ్య వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. యువత సన్మార్గంలో ప్రయాణించాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రీడలతో పాటు చదువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పంట పొలాలు, చేలల్లో పర్యటన

మండలంలోని చంద్రుపట్ల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీరయ్య రైతులతో కలిసి పంట పొలాలు, చేలల్లో ద్విచక్రవాహనంపై పర్యటించారు. రైతులు పొలాలకు వెళ్లే రహదారులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రహదారి సమస్య ఉందని రైతులు తెలపడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలను జారీ చేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దాట్ల వీరవెంకట సీతారామరాజు, పేరూరు ఎస్సై హరీష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు దృఢ సంకల్పంతో ఉండాలి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క, సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, మహిళలు



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న తస్లీమా, పూర్ణ

ములుగు: మహిళలు నేటి సమాజంలో రాణించాలంటే సహనంతో పాటు దృఢ సంకల్పంతో ఉండాలని ఎమ్మెల్యే ధనసరి సీతక్క సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో సర్వర్ చారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సర్వర్ ట్రస్ట్, ఫౌండేషన్ చైర్మన్, సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. సమాజంలో అందరూ సమానమనే అనే విధంగా ప్రతి రంగంలోను మహిళలు రాణిస్తుండడం సంతోషకరం అన్నారు. మథర్ థెరీసా లాగా ఉద్యోగంతో పాటు పేదలకు సేవ చేయడంలో తస్లీమా గొప్ప సేవకురాలిగా ఎదుగుతుందని అన్నారు. అనంతరం తస్లీమా మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి, చట్టాలు, మహిళల సాధికారిత, స్వయం సహాయక రంగాలపై అవగాహన కల్పించడం కోసం అమెరికాలోని కొంత మంది ఎన్నారైల సహకారంతో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు, పురుషులతో సమానంగా రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది రచన రెడ్డి మాట్లాడుతూ.. సృష్టిలో స్త్రీ లేకపోతే జీవం లేదని, జనన, గమనాలకు మూలం స్త్రీలేనని అన్నారు. మహిళ శక్తి మహోన్నత శక్తి అని, రాణి రుద్రమదేవిని ఆదర్శంగా తీసుకుని నాయకత్వ లక్షణాలను అవలంభించుకోవాలని సూచించారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన మాలవత్ పూర్ణ మాట్లాడుతూ.. ఆకాశంలో సగం అనేది నిన్నటి మాట.. ఆకాశమే తమ వశం కావాలన్నది ఆధునిక మహిళ బాట అని అన్నారు. అనంతరం ట్రస్టు, ఫౌండేషన్ తరుపున మహిళ కానిస్టేబుల్స్‌ను శాలువా, మెమెంటోస్ అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి, సీడబ్ల్యూసీ చైర్మన్ వసుధ, ప్రీతి దయాళ్, రమాదేవి, వలిబీయా, మహిళ సర్పంచ్‌లు, మహిళ సంఘాల సభ్యులు, సర్వర్ చారిటబుల్ ట్రస్ట్–ఫౌండేషన్ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలోని వాటర్ ట్యాంక్ పైపు లీకేజీ నుంచి తాగునీరు వృథా అవుతుంది. ఈ నీటితో చిన్న పాటి కుంటను తలపిస్తుంది. దీంతో దోమల వ్యాప్తి చెందడంతో పాటు, పలువురు అనారోగ్య పాలవుతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టి పైపు లీకేజీని మరమ్మతు చేపించాలని పలువురు కోరుతున్నారు.